సాక్షి నిజామాబాద్

మంగళవారం । 19 । నవంబర్ । 2024



బేస్‌బాల్ జిల్లా జట్ల విజయం
నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు గెలుపొందాయి.
- 8లో ▸



సనాతన ధర్మాన్ని ఆచరించాలి
కోటగిరిలో నిర్మించిన అయ్యప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం ఘనంగా నిర్వహించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /12.6

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రూ.1.05 కోట్ల విలువైన గంజాయి కాల్చివేత



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ గ్రామ శివారులో గల శ్రీ మెడికేర్ సర్వీసెస్‌లో సోమవారం రూ.1.05 కోట్ల విలువైన ఎండు గంజాయిని అధికారులు దహనం చేశారు. ఆర్మూర్, భీమ్‌గల్, నిజామాబాద్, మోర్తాడ్ ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో దొరికిన 353 కిలోల గంజాయి, 1.5 కిలోల డైజోఫాం, 2.5 కేజీల అల్ప్రాజోలం కాల్చివేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మల్లారెడ్డి పర్యవేక్షణలో వాటిని దహనం చేశారు. ఆర్మూర్, మోర్తాడ్, నిజామాబాద్, భీమ్‌గల్ ఎస్‌హెచ్‌వోలు స్టీవెసన్, గుండప్ప, దిలీప్, వేణుమాదవరావు, వివిధ స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు బోనస్ అందిస్తున్న ప్రభుత్వం



ఆర్మూర్: సన్న రకం ధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వం బోనస్ అందిస్తున్నట్లు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్‌లోని విత్తన అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేస్తు వస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మరో రెండు నెలల్లో పసుపు పంట చేతికి వస్తుందని, పసుపు బోర్డు ఊసే లేదన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు.

విద్యుత్ ఆర్టిజన్ల జేఏసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జాయింట్ కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గంగలస్వామి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కమిటీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా ప్రణీత్‌గౌడ్, కన్వీనర్‌గా శ్రీకాంత్‌యాదవ్, కోకన్వీనర్లుగా అశ్విన్, తిరుపతిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శివానంద్, కోశాధికారిగా స్వామి, సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రసాద్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి స్వామి మాట్లాడుతూ 15 ఏళ్లుగా వెట్టిచాకిరికి గురవుతున్న ఆర్టిజన్ల మనోభావాలను దెబ్బతీసేలా విద్యుత్ యూనియన్ల నాయకులు కొందరు మాట్లాడడం సరికాదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా



నిజామాబాద్‌నాగారం: దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డి మాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు నూతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే రామ్మోహన్‌రావు తెలిపారు. నాందేవ్‌వాడలోని అసోసియేసన్ కార్యాలయంలో సోమవా రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలని, నగ దు రహిత వైద్యం అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనుమతించాలన్నారు. పీఆర్‌సీని 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చే యాలని, కమిటేషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీ ర్పును అమలు చేయాలన్నారు. వెల్‌నెస్ సెంటర్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు హన్మాండ్లు, కార్యదర్శి ప్రసాద్‌రావు, గౌరవ అధ్యక్షుడు దత్తాత్రేయరావు, జిల్లా నాయకులు బాబాగౌడ్, లావు వీర య్య, భోజారావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యాశాఖలో
ప్రక్షాళన జరిగేనా..?



జిల్లా విద్యాశాఖలో జరిగిన బదిలీలు, పదోన్నతులు, డీఎస్సీ నియామకాల ప్రక్రియపై విచారణ చేపట్టాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. వారం రోజుల్లో ప్రత్యేక అధికారిని జిల్లాకు పంపనున్నారు. గతంలో జరిగిన అనేక డిప్యుటేషన్లు, బదిలీలు, పదోన్నతులలో పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క బిజినెస్ టీచర్లుగా పేరుపొందిన చాలా మంది ఉపాధ్యాయులు సొంత వ్యాపకాలకు ప్రాధాన్యత ఇస్తూ క్షేత్ర స్థాయిలో పాఠశాలలకు ముఖం చాటేస్తున్నారు. మరి కొందరు ఉపాధ్యాయ సంఘాల ముసుగులో సొంత పనులే చూసుకుంటున్నారు.

- అక్రమ డిప్యుటేషన్లు, పదోన్నతులు
- పాఠశాల విధులకు డుమ్మాకొడుతున్న సంఘాల నేతలు
- పారదర్శకత లోపించిన డీఎస్సీ నియామకాలు
- విచారణకు రానున్న ప్రత్యేక అధికారులు !

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇటీవల జరిగిన డీఎస్సీ నియామకాల్లో ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని బహిరంగంగానే ఆరోపణలు వచ్చాయి. కొంత మంది డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగం వచ్చి, విధులో చేరిన వారిని తర్వాత తొలగించిన ఘటనలు ఉన్నాయి. మరికొందరు అభ్యర్థులు ధ్రువ పత్రాల పరిశీలనకు రాకున్నా.. వచ్చినట్లు నమోదు చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని అంటున్నారు. ఈ అంశం వివాదాస్పదంగా మారుతోంది. వీటన్నింటిపై ప్రత్యేక అధికారి విచారణ చేసే అవకాశం ఉందని సమాచారం.

పదోన్నతుల్లో లొల్లి..

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పదోన్నతుల లోనూ వివాదాలు నెలకొన్నాయి. మొదటి లిస్టు పదోన్నతుల్లో అనుకూలంగా లేని ప్రదేశాలకు పోస్టింగ్‌లు రావడంతో కొంతమంది నాట్ విల్లింగ్ రాసిచ్చారు. వీరికి మరో ఆర్నేళ్ల వరకు పదోన్నతులకు అవకాశం ఉండదు. అయితే అంతకు ముందే ప్రకటించే పదోన్నతుల జాబితాల్లో నాట్ విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు అనుకూలమైన చోటికి పోస్టింగ్‌లు వచ్చాయి. ఈ సందర్భంగా భారీగానే ముడుపులు చేతులు మారినట్లు తెలుస్తోంది. ఇలా పదోన్నతి పొందిన వారిలో 15 మంది వరకు ఉంటారని విద్యాశాఖ వర్గాల వారు చెబుతున్నారు. గణితం విభాగం పదోన్నతిలో జూనియర్ అయినా ఒక ఉపాధ్యాయుడికి దగ్గర స్థానం కేటాయించారు. స్పౌజ్ కేసుల్లోనూ అక్రమంగా బదిలీలు జరిపారంటూ పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవలే జిల్లా విద్యాశాఖలో 16 మంది ఉపాధ్యాయులకు డిప్యుటేషన్లు అనధికారికంగా వేశారని తెలిసింది. ప్రయివేట్ పాఠశాలలకు అక్రమ మార్గంలో అనుమతులు కొనసాగుతున్నాయి. ఇలా విద్యాశాఖపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధర్పల్లి ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌లను జిల్లా కేంద్రానికి బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

బిజినెస్ టీచర్‌లపై చర్యలు?

జిల్లాలో కొందరు టీచర్లు ఉపాధ్యాయ సంఘం ముసుగులో సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. చిట్టీల వ్యాపారం, రియల్ ఎస్టేట్, బిజినెస్ వ్యవహారాలు నడుపుకుంటూ పాఠశాల విధులకు డుమ్మా కొడుతున్నారు. నిజామాబాద్ నగరం, ఆర్మూర్ పట్టణంలో ఇటువంటి టీచర్లు ఎక్కువగా ఉన్నారు. జిల్లాలోని కొన్ని సంఘాల నేతలు ఉపాధ్యాయుల వ్యక్తిగత పనులు చేయడానికి డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతూ విధులకు వెళ్లడం లేదు. సెప్టెంబర్‌లో జరిగిన ఓ ప్రధాన సంఘం ఎన్నికల్లో ఆర్మూర్ ప్రాంతానికి చెందిన ఒక డివిజన్ నాయకుడు అన్ని మండలాల ఎన్నికలు నిర్వహిస్తూ అసలు బడికి వెళ్లలేదు. ఇలా గాడి తప్పిన విద్యాశాఖలో ప్రక్షాళన జరుగుతుందా అని పలువురు టీచర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాంప్లెక్స్ హెచ్‌ఎంల తీరుతో...

జిల్లాలోని కొన్ని మండలాల్లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల తీరుతో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఇబ్బంది కరంగా మారింది. సర్వీస్ వెరిఫికేషన్ ఇంక్రిమెంట్‌ల మంజూరు విషయంలో కొత్తగా వచ్చిన కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సర్వీస్ పుస్తకాలలో సంతకాలు చేయడం లేదంటున్నారు.

ముగిసిన గ్రూప్–3 పరీక్షలు



నగరంలోని పాలిటెక్నిక్ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం రెండు పరీక్షలు జరగ్గా, సోమవారం ఉదయం పేపర్–3 పరీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అని పరిశీలించి పలు సూచనలు చేశారు. సోమవారం జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 19,941 మంది అభ్యర్థులకు 9,880 మంది హాజరయ్యారు. 49.54 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు. సగానికి పైగా అభ్యర్థులు పరీక్ష రాయలేదు.

కేంద్రాలను పరిశీలించిన డీసీపీలు

ఖలీల్‌వాడి: గ్రూప్–3 పరీక్ష కేంద్రాలను సోమవారం డీసీపీలు పరిశీలించారు. అదనపు పోలీస్ కమీషనర్లు కోటేశ్వర రావు(అడ్మిన్), బస్వారెడ్డి(లా అండ్ ఆర్డర్), శంకర్ నాయక్(ఏఆర్) పలు కేంద్రాలను పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు చేశారు.



నగరంలోని నిర్మల హృదయ పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు

సర్వే మరో రెండు రోజులు

- నమోదు పూర్తి కాని కుటుంబాల వివరాలు
- గడువు పెంచుతూ అధికారుల ఆదేశాలు

మోర్తాడ్(బాల్కొండ)/నిజామాబాద్ అర్బన్ : సమగ్ర సర్వే గడువు మరో రెండు రోజుల పాటు పొడిగిస్తూ ఎన్యుమరేటర్లు, పరిశీలకులకు మౌఖిక ఆదేశాలు అందాయి. షెడ్యూల్ ప్రకారం సోమవారంతోనే సర్వే ముగించాల్సి ఉంది. ఈ నెల 6న సర్వే ఆరంభం కాగా మొదట్లో ఒక్కో కుటుంబం వివరాల నమోదుకు ఎక్కువ సమయం పట్టింది. రోజుకు ఒక ఎన్యుమరేటర్ 20 కుటుంబాల వివరాలను నమోదు చేయాలని నిర్దేశించారు. ఆశించిన సమయంలో వివరాల నమోదు కాకపోవడంతో సర్వే గడువు పెంచుతారని ప్రచారం జరిగింది. 15 రోజుల పాటు సమగ్ర సర్వేలో వివరాలను నమోదు చేయాలని నిర్ణయించారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 నుంచి 170 ఇళ్లను సందర్శించి వివరాలను నమోదు చేయాల్సి ఉంది. అయితే వివరాలు నమోద చేయడానికి ఎక్కు సమయం పట్టడంతో గడువు ముగిసే నాటికి ఇంకా ఇళ్లు మిగిలిపోయాయి. మంగళ, బుధవారాల్లో మిగిలిపోయిన కుటుంబాల సమాచారం సేకరించాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. సర్వేకు గడువు పెంచడంతో ఎన్యుమరేటర్లకు ఊపిరి పీల్చుకున్నట్లు అయ్యింది. ఇప్పటి వరకు 80 శాతం సర్వే పూర్తి కాగా మరో 20 శాతం వివరాల నమోదు రెండు రోజుల్లో పూర్తి అయ్యే అవకాశం ఉంది.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అధికారులు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 90 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ అంకిత్, ట్రెయిని కలెక్టర్ సంకేత్ కుమార్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

బకాయిలు వెంటనే చెల్లించండి

పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు సంబంధించిన రూ.175 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, కుల వివక్ష పోరాట సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

నాణ్యమైన విద్య అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేవిధంగా చూడాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ కోరారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలకు ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: రాష్ట్రంలో ప్రజా పాలనకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సాయంత్రం 6 గంటలకు ప్రజా కళాయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కళాయాత్ర చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కళాయాత్ర ప్రతినిధులు రాష్ట్రమంతా పర్యటిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా నిజామాబాద్‌లో 20న అంతడుపుల నాగరాజు బృందం విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, డీపీఆర్‌వో పద్మశ్రీ, ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్ ఉమేష్ చంద్ర, బీసీ సంక్షేమ అధికారి స్రవంతి, ఏసీపీ రవీందర్ రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీఈవో అశోక్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, యువజన క్రీడల అధికారి ముత్తెన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

మేయర్ భర్తపై దాడి

- తీవ్రంగా గాయపడ్డ దండు చంద్రశేఖర్
- ఆస్పత్రికి తరలించిన స్థానికులు
- తన భూమి కబ్జా చేయడంతోనే దాడి చేశానన్న నిందితుడు
- వీడియో విడుదల



చంద్రశేఖర్‌పై దాడి చేస్తున్న నిందితుడు



చంద్రశేఖర్‌కు సపర్యలు చేస్తున్న స్థానికులు



చికిత్స పొందుతున్న చంద్రశేఖర్

ఖలీల్‌వాడి: నగర మేయర్ దండు నీతూ కిరణ్ భర్త బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ దండు చంద్రశేఖర్ అలియాస్ శేఖర్‌పై దాడి జరిగింది. సోమవారం సాయంత్రం పదో డివిజన్‌లోని ఓ వాటర్ ప్లాంట్ వద్ద 80 క్వార్టర్స్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ రసూల్ అలియాస్ శుక్రు దాడి చేశాడు. నడుచుకుంటూ వచ్చిన రసూల్ దగ్గరికి రాగానే దాడి చేశాడు. దీంతో శేఖర్ కింద పడిపోయాడు. పక్కనే ఉన్న వారు అడ్డుకోడానికి యత్నించగా రసూల్ బెదిరించాడు. అనంతరం ఆటోలో నుంచి సుత్తి తీసుకొని వచ్చి కొట్టాడు. గాయపడ్డ శేఖర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

దాడి వీడియో వైరల్

దాడి చేయడానికి రసూల్ ముందుగానే ప్రణాళిక వేసుకున్నట్లు తెలుస్తోంది. దాడి చేయడానికి వెళ్లే సమయంలో వీడియో తీసేందుకు వ్యక్తిని ముందుగానే సిద్ధం చేసుకున్నాడు. దండు శేఖర్ అనుచరులు భూ వివాదంలో ఇబ్బందులకు గురి చేయడంతో దాడికి పాల్పడ్డారనే అభిప్రాయాలు ఉన్నాయి. మేయర్ భర్త శేఖర్‌పై జరిగిన దాడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్థానికంగా వంద గజాల ప్లాట్ వివాదంలో ఈ దాడి జరిగినట్లు తెలిసింది.

డబ్బులు డిమాండ్ చేయడంతో..

దాడి అనంతరం నిందితుడు రసూల్ వీడియో విడుదల చేశాడు. దండు శేఖర్ అనుచరులు గోపాల్ తోపాటు మరి కొంత మంది తన భూమి కబ్జా చేశారని పేర్కొన్నాడు. మూడేళ్ల నుంచి వారు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రూ.రెండు లక్షల డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించాడు. ఎన్నో సార్లు శేఖర్‌ను కలిసి తన భూమి అప్పగించాలని అడిగినా ఆయన ఒప్పుకోకపోవడంతో దాడి చేశానని చెప్పారు. గత 15 ఏళ్లుగా తాను కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నాని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు సాయం చేయాలని కోరాడు.

ఆస్పత్రికి వచ్చిన అనుచరులు

శేఖర్‌పై దాడి విషయం తెలియడంతో ఆయన అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఆస్పత్రికి తరలి వచ్చారు. శేఖర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. భారీ స్థాయిలో కార్యకర్తలు రావడంతో హాస్పిటల్ ప్రాంతం కిక్కిరిసిపోయింది.

గోపాల్‌పై గతంలో కేసు

నగరంలోని నాగారం ప్రాంతంలోని శిఖం భూమి కబ్జా చేసి ఇంటి స్థలాలు విక్రయించిన కేసులో గోపాల్ ఏ2గా ఉన్నారు. రసూల్ తన ఇంటి స్థలాన్ని దండు శేఖర్ అనుచరుడు గోపాల్‌తోపాటు మరి కొంత మంది కబ్జా చేశారని వీడియో విడుదల చేయడంతో నగరంలో చర్చ జరుగుతోంది. కాగా గోపాల్ విలేకరులతో మాట్లాడుతూ.. రసూల్‌తో తనకు భూ వివాదం లేదన్నారు. భూ వివాదం ఉంటే అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కావాలని తనపై ఆరోపణలు చేశాడన్నారు. శేఖర్‌పై దాడి వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలుగు బృందాలతో గాలిస్తున్నాం

- ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: మేయర్ భర్త దండు శేఖర్‌పై దాడి చేసిన వ్యక్తిని పట్టుకోవడానికి నాలుగు బృందాలు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన మాట్లాడారు. భూ వివాదం నేపథ్యంలో రసూల్ దాడి చేశాడని చెప్పారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. దాడి వెనుక ఎవరి హస్తమైనా ఉందా అన్న కోణంలో ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తను, సహకరించాలని వీడియో రిలీజ్ చేయడంపై విలేకరులు అడగ్గా అలాంటిది ఏమి లేదని ఏసీపీ చెప్పారు. నిందితుడు ఆటో డ్రైవర్‌గా, బౌన్సర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. శేఖర్ ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

- కామారెడ్డి బస్సు కోసం మూడు గంటల నిరీక్షణ
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ నుంచి కామారెడ్డికి సోమవారం బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. దాదాపు మూడు గంటల పాటు బస్సులు రాకపోవడంతో బస్టాండ్‌లో నిరీక్షించారు. ఇతర డిపోల నుంచి వచ్చే లగ్జరి బస్సులు నేరుగా జేబీఎస్ వెళ్తున్నాయి. దీంతో కామారెడ్డి వెళ్లాల్సిన వారు అవస్థలు పడ్డారు. చివరకు మెట్‌పల్లి డిపోకు చెందిన ఓ ఎక్స్‌ప్రెస్ బస్సు హైదరాబాద్‌కు వెళ్లడానికి రాగా ప్రయాణికులు పోటీ పడి ఎక్కారు. బస్సుల గురించి అధికారులను అడిగితే సరైన సమాచారం ఇవ్వలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల సంఖ్య పెంచాలని కోరారు.



మెట్‌పల్లి డిపో బస్సు రావడంతో ఎక్కడానికి పోటీ పడుతున్న ప్రయాణికులు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌కు ఎంపిక



మోపాల్‌: మండలంలోని కంజర్‌ మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కొట్బాల్‌ స్నేహిత్‌ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీలకు ఎంపికైనట్లు ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఇటీవల స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్‌ – 14 సాఫ్ట్‌బాల్‌ పోటీలను ఆర్మూర్‌ గురుకుల పాఠశాలలో నిర్వహించగా స్నేహిత్‌ ఉత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా స్నేహిత్‌ను పీఈటీ నవీన్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి తైక్వాండోకు..



నిజామాబాద్‌అర్బన్‌: మార్షల్‌ ఆర్ట్స్‌ తైక్వాండో అండర్‌ – 19 జాతీయ స్థాయి క్రీడాపోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా ఇంటర్‌ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్‌ సోమవారం తెలిపారు. సంగారెడ్డిలో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్‌ –19 విద్యార్థుల తైక్వాండో మార్షల్‌ ఆర్ట్స్‌ పోటీలను నిర్వహించగా, జిల్లా నుంచి విద్యార్థుల బృందం పాల్గొని మూడు బంగారు పతకాలు, మూడు వెండి పతకాలు, మూడు కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను జిల్లా ఇంటర్‌ విద్యాధికారి తన కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు.

రేపు హాకీ ఎంపికలు

నిజామాబాద్‌ నాగారం: నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల ఎస్‌జీఎఫ్‌–19 హాకీ ఎంపికలను 20వ తేదీన ఆర్మూర్‌ మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 జనవరి 2006 తరువాత జన్మించిన వారు అర్హులని, సరైన ధ్రువీకరణ పత్రాలతో ఎంపికలకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98484 26821 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

- హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి
- కోటగిరిలో వైభవంగా అయ్యప్ప, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమంలో పాల్గొన్న హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి



భక్తులనుద్దేశించి ప్రవచిస్తున్న విద్యారణ్యభారతి స్వామీజీ

రుద్రూర్‌: సనాతన ధర్మం విశేషమైనదని, ప్రపంచానికి ఆచరణ యోగ్యమైనదని, ఇప్పటికే పలు దేశాల్లో ఆచరిస్తున్నారని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. కోటగిరిలో నూతనంగా నిర్మించిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి– సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి, గురుస్వాములు చంద్రమౌళి, వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకం, యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్పమాలధారులు, భక్తులు, దాతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నిజామాబాద్‌ అర్బన్‌ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ హాజరయ్యారు. బ్రహ్మముహూర్తం, వస్త్రాధారణ, విభూతిధారణ, భగవన్నామ స్మరణ, సాత్వికాహారం తదితర అంశాలపై విద్యారణ్య భారతి ప్రవచించారు. గత ఐదు రోజులుగా ఉత్సవాలు కొనసాగాయి. విగ్రహ శోభాయాత్ర, అఖండ నామస్మరణ, యాగశాల ప్రవేశం, మహా సుదర్శన హోమం, మహా చండీహోమం కార్యక్రమాలను నియమ నిష్ఠలతో చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. రాత్రి వేళ అయ్యప్ప మాలధారులు తొలి పడి పూజ, పుష్పాభిషేకం చేశారు. భజనలు, కీర్తనలు అయ్యప్ప స్వామి నామ స్మరణతో కోటగిరి పరిసరాలు మారుమోగాయి.

రక్తదానం.. స్వచ్ఛంద సేవ

- ఆపదలో ఉన్న వారి కోసం 50 సార్లు రక్తదానం చేసిన రమేశ్‌
- 30 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలు
- 1993 నుంచి నేటి వరకు స్వచ్ఛందంగా సేవలు



నేషనల్‌ వలంటరీ బ్లడ్‌ డొనేషన్‌ డే సందర్భంగా 2018లో మెమెంటో అందుకుంటున్న రమేశ్‌

నిజామాబాద్‌ రూరల్‌: మనం చేసే రక్తదానం.. ఎదుటి వ్యక్తికి ప్రాణదానమని గట్టిన నమ్మిన నగరానికి చెందిన ధాత్రిక రమేశ్‌ ఇప్పటి వరుక 50 సార్లు రక్తదానం చేశారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. 1993 నుంచి ఆయన 'స్వచ్ఛంద' సేవలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రాణపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి మొట్టమొదటిసారి రమేశ్‌ రక్తాన్ని ఇచ్చి ప్రాణాలు కాపాడాడు. ఆ ఘటనతో రక్తం వెలువ తెలుసుకున్న ఆయన.. రక్తదానం చేస్తూనే ఉన్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరుతున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీకి రక్తం అత్యవసరంగా కావడంతో రెడ్‌క్రాస్‌ సొసైటీ ద్వారా రమేశ్‌ రక్తదానం చేశారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్‌ ఆధ్వర్యంలో పది మంది మూకుమ్మడిగా ఏర్పడి రక్తదానం చేస్తారు. అంతేకాకుండా మహనీయుల జయంతి, వర్ధంతులను పురస్కరించుకొని రక్తదానం చేస్తామని ధాత్రిక రమేశ్‌ తెలిపారు. రక్తదానం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా జిల్లాలో ధాత్రిక రమేశ్‌ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రాణదానంతో సమానం



మనం చేసే రక్తదానం ఎదుటివారికి ప్రాణదానంతో సమానం. నేను ఏడాదిలో రెండు, మూడుసార్లు రక్తదానం చేస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడుతున్నాను. నేటి రోజుల్లో యువత రక్తదానం చేయాలంటే ఎన్నో విధాలుగా ఆలోచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి.

– ధాత్రిక రమేశ్‌

కొడుకు ప్రాణాల కోసం తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

- గులియన్‌ – బారే సిండ్రోమ్‌ బారిన పడిన బాలుడు
- హైదరాబాద్‌లోని రెయిన్‌బోలో చికిత్స
- రూ.40లక్షలు ఖర్చు చేసినా నయంకాని జబ్బు
- ప్రభుత్వం, దాతల సహకారం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు



రెయిన్‌బోలో చికిత్స పొందుతున్న శ్రేయాన్‌

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బెజుగం ప్రసాద్‌ అనే వ్యక్తి కుమారుడు శ్రేయాన్‌ (11) ప్రపంచంలోనే అరుదుగా వచ్చే గులియన్‌ – బారే సిండ్రోమ్‌ బారినపడ్డాడు. జూన్‌లో శ్రేయాన్‌ను హైదరాబాద్‌లోని రెయిన్‌బో పిల్లల ఆసుపత్రిలో చేర్పించగా, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. చికిత్సకోసం బాలుడి తల్లిదండ్రులు ఇప్పటి వరకు రూ.40 లక్షలు ఖర్చు చేశారు. అయినప్పటికీ నయం కాకపోగా బాలుడి ఆరోగ్యం మరింత క్షీణిస్తోంది. ఇంకా ఎంత ఖర్చవుతుందో తెలియన పరిస్థితి ఉండగా, చేతిలో డబ్బులు లేక ఆ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి తమ కుమారుడి ప్రాణాలను కాపాడాలని వేడుకుంటున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి 94939 32777 నంబర్‌ ద్వారా సాయం చేయాలని కోరుతున్నారు.

ఐదు మొరం టిప్పర్లు సీజ్‌

కామారెడ్డి క్రైం/బాన్సువాడ : 'మాయమవుతున్న గుట్టలు' శీర్షికన ఈనెల 14న 'సాక్షి' దినపత్రిలో ప్రచురితమైన కథనంపై బాన్సువాడ తహసీల్దార్‌ వరప్రసాద్‌ స్పందించారు. సోమేశ్వర్‌ గుట్ట నుంచి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ఐదు టిప్పర్లతోపాటు జేసీబీని సోమవారం ఆయన సీజ్‌ చేశారు. వాహనాలను పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు.



బేస్‌బాల్‌ జిల్లా జట్ల విజయం





ప్రథమస్థానంలో నిలిచిన బాలబాలికల జట్లు

నిజామాబాద్‌ నాగారం: నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన స్కూల్‌ గేమ్స్‌ రాష్ట్ర బేస్‌బాల్‌ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు సత్తాచాటాయి. ఫైనల్‌ మ్యాచ్‌లలో బాలికల జట్టు ఆదిలాబాద్‌ జట్టుపై 7 – 0 తేడాతో విజయం సాధించగా, బాలుర జట్టు ఆదిలాబాద్‌ జట్టుపై 6 – 1 తేడాతో విజయం సాధించి బంగారు పతకాలు అందుకున్నట్లు జిల్లా స్కూల్‌ గేమ్స్‌ కార్యదర్శి నాగమణి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేస్‌బాల్‌ టోర్నమెంట్‌ అబ్జర్వర్‌ మర్కంటి గంగామోహన్‌, జట్టుకు కోచ్‌, మేనేజర్లుగా రాజ్‌కుమార్‌, నరేశ్‌, ఎం సుజాత, సంతోష్‌ వ్యవహరించారు.

'చేప విత్తనోత్పత్తి కేంద్రానికి పూర్వవైభవం తెస్తాం'



నిజాంసాగర్‌: అచ్చంపేటలోని చేప విత్తనోత్పత్తి కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని జుక్కల్‌ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హామీ ఇచ్చారు. సోమవారం నిజాంసాగర్‌ ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్చంపేట చేప విత్తనోత్పత్తి కేంద్రాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం వచ్చిన నిధులను బీఆర్‌ఎస్‌ నాయకులు దోచుకోవడం వల్ల నిరుపేదలు స్వయం ఉపాధికి దూరమయ్యారని ఆరోపించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వందశాతం సబ్సిడీపైన 24 లక్షల చేప పిల్లలను నిజాంసాగర్‌ ప్రాజెక్టులో వదులుతున్నామన్నారు. రాష్ట్ర మత్స్యశాఖ ఫెడరేషన్‌ చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌, జిల్లా అధ్యక్షుడు గాదం సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు మల్లికార్జున్‌ పాల్గొన్నారు.

కంటి వైద్యుడు భీమ్‌సింగ్‌ మృతి



నిజామాబాద్‌ నాగారం: సీనియర్‌ కంటి వైద్యుడు భీమ్‌సింగ్‌ సోమవారం గుండెపోటుతో మరణించారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన చనిపోయారు. భీమ్‌సింగ్‌ గతంలో నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. జిల్లా ప్రజలకు కంటి వైద్యుడిగా సేవలందించారు.

రెండు నెమళ్ల కళేబరాలు స్వాధీనం



నవీపేట: మండలంలోని కమలాపూర్‌ శివారులో సోమవారం రెండు నెమళ్ల కళేబరాలు ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ సుధీర్‌, సెక్షన్‌ ఆఫీసర్‌ జెహ్రూ వచ్చి నెమళ్ల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు. వేటగాడిగా అనుమానిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నెమళ్లను చంపాడా? లేకపోతే ప్రమాదవశాత్తు చనిపోయాయా? అనేకోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. నెమళ్ల కళేబరాలకు పోస్టుమార్టం పూర్తయిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఫారెస్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి



బాల్కొండ: మండల కేంద్రంలో వీధి కుక్కలు సోమవారం స్వైర విహారం చేశాయి. కుక్కల దాడిలో మండల కేంద్రానికి చెందిన ముస్కాన్‌, ఆదిత్యకు గాయాలయ్యాయి. మండల కేంద్రంలో కుక్కలు బెడద నివారణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గాయాలపాలైన చిన్నారులకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

రెండేళ్ల చిన్నారిపై కోతులు..

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన రెండేళ్ల చిన్నారి ఫైమా బేగంపై సోమవారం కోతులు దాడులు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లో ఆడుకుంటున్న చిన్నారిపై కోతులు దాడి చేయడంతో తొడకు గాయమైంది. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోడంతో కోతులు వెళ్లిపోయాయి. కోతుల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆర్మూర్‌టౌన్‌: పెర్కిట్‌లోని తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. తాజుద్దీన్‌ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం వ్యక్తిగత పనులపై కామారెడ్డికి వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం ధ్వంసం చేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ పరిశీలించారు. బీరువాలో నుంచి 10 తులాల బంగారం, రూ.లక్ష నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

రెంజల్‌(బోధన్‌): గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్‌ మండలం ఊట్‌పల్లికి చెందిన బదావత్‌ శివ(34) కొంతకాలంగా అత్తగారి గ్రామమైన వీరన్నగుట్టతండాలో ఉంటున్నాడు. తొమ్మిది నెలలుగా మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ఆదివారం ఉదయం కూలీ పనికి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన శివ గడ్డి మందు తాగి రెంజల్‌ గ్రామ శివారులో పడిఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శివను 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

ఎడపల్లి (బోధన్‌): మండలంలోని దుబ్బ తండాకు చెంది వివాహిత ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. భర్త ఇటీవల మృతి చెందగా, పిల్లలతో కలిసి సదరు మహిళ ఉంటోంది. సోమవారం ఉదయం నుంచి పిల్లలతోపాటు తల్లికనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంచిప్ప శివారులో ఎలుగుబంటి సంచారం

మోపాల్‌: మండలంలోని మంచిప్ప పెద్ద చెరువు తూము వద్ద ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు ఎలుగుబంటిని చూసి భయాందోళనకు గురయ్యారు. ఏడాది కాలంగా ఎలుగుబంటి సంచరిస్తోందని అటవీశాఖ అధికారులకు తెలుపుతున్నా వారు పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారులు స్పందించి ఎలుగుబంటిని బంధించి దూర ప్రాంతంలో వదిలేయాలని కోరుతున్నారు. ఈ విషయమై బీట్‌ ఆఫీసర్‌ సురేశ్‌ను వివరణ కోరగా.. రైతులు జాగ్రత్తగా ఉండాలని, మంగళవారం ఎలుగుబంటి సంచారం ఆనవాళ్లను సేకరిస్తామన్నారు.

పతంగి కోసం వెళ్తే ప్రాణాలు పోయాయి

- చెట్టెక్కి పతంగి తీస్తుండగా విద్యుత్‌షాక్‌
- 12 ఏళ్ల బాలుడు మృతి
- కుర్నాపల్లిలో ఘటన



షేక్‌ మతీన్‌ (ఫైల్‌)



ఘటనాస్థలంలో షేక్‌ మతీన్‌ మృతదేహం

ఎడపల్లి (బోధన్‌): చెట్టుకు వేలాడుతున్న పతంగిని తీసేందుకు ప్రయత్నించిన బాలుడు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఘటన మండలంలోని కుర్నాపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కుర్నాపల్లి గ్రామానికి చెందిన షేక్‌ మతీన్‌ (12) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5వరగతి చదువుతున్నాడు. సోమవారం మంగళ్‌పాడ్‌లోని హెయిర్‌ సెలూన్‌లో కటింగ్‌ చేయించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా, రోడ్డు పక్కన చెట్టుకు గాలిపటం వేలాడుతూ కనిపించింది. మతిన్‌ దానిని తీసేందుకు ఒక ఇనుప రాడ్‌ పట్టుకొని చెట్టెక్కాడు. గాలిపటాన్ని తీస్తున్న క్రమంలో ఆ రాడ్డు విద్యుత్‌ తీగలపై పడి చెట్టుపైనే ప్రాణాలు వదిలాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. విద్యుత్‌ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగింపజేయడంలో లైన్‌మెన్‌ జగదీశ్‌ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిని వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్‌ చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న సబ్‌ ఇంజినీర్‌ జావిద్‌ బాధిత కుటుంబ సభ్యులతో, గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి విద్యుత్‌శాఖ నుంచి నష్టపరిహారం అందేలా చూస్తానని చెప్పగా, పోలీసులు సైతం వారిని సముదాయించడంతో చివరకు మృతదేహాన్ని చెట్టుపైనుంచి కిందికి దింపారు. మృతుడి తల్లి సాహీదాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంగాసముందర్‌లో ఇద్దరికి డెంగీ



వివరాలు సేకరిస్తున్న మెడికల్‌ ఆఫీసర్‌ విద్యాసాగర్‌

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. గంగాసముందర్‌ గ్రామంలో ఇద్దరు డెంగీ బారిన పడ్డారు. సమాచారం అందుకున్న మెడికల్‌ ఆఫీసర్‌ విద్యాసాగర్‌తోపాటు వైద్య బృందం సోమవారం గంగాసముందర్‌లో పర్యటించింది. ఓ మహిళ డెంగీ బారిన పడి చికిత్స తీసుకుని కోలుకుంటుండగా, మరో వ్యక్తి ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోవడంతో జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. డెంగీ బాధితుల ఇళ్లకు వైద్యాధికారులు వెళ్లి మిగతా కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకున్నారు. గ్రామంలో ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ఇళ్లలోకి దోమలు రాకుండా చూసుకోవాలన్నారు. గ్రామంలో డెంగీ కేసులు నమోదు కావడంతో పంచాయతీ కార్యదర్శి మోహన్‌ సానిటేషన్‌ డ్రైవ్‌ నిర్వహించారు. దోమల మందు ఫాగింగ్‌ చేశారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి ట్రాఫిక్‌ సీఐ వీరయ్య సోమవారం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. అనంతరం వారందరినీ మార్నింగ్‌ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్‌ అహ్మద్‌ మోయినొద్దీన్‌ తొమ్మిది మందికి రూ. 21,500 జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధించారు.

ధాన్యం లారీ బోల్తా.. మహిళకు తీవ్ర గాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో సోమవారం ధాన్యం లారీ బోల్తా పడడంతో మహిళకు తీవ్ర గాయాలైనట్లు ఏఎస్సై ప్రకాశ్‌నాయక్‌ తెలిపారు. ధాన్యం లోడ్‌తో బాన్సువాడ డివిజన్‌లోని దుర్కి గ్రామానికి వెళ్తుండగా పెద్దవాగు మూలమలుపు వద్ద డ్రైవర్‌ నిర్లక్ష్యం కారణంగా లారీ బోల్తాపడింది. రోడ్డు పక్కన నిలబడి ఉన్న అయిలాపూర్‌ గ్రామానికి చెందిన మిద్దె మౌనికపై ధాన్యం బస్తాలు పడడంతో తీవ్ర గాయాలైనట్లు ఏఎస్సై తెలిపారు. మౌనిక తనతోపాటు ఉన్న కూతురిని పక్కకు నెట్టివేయడంతో పాప ప్రమాదం నుంచి బయటపడింది. గాయాలైన మౌనికను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. ఘటనాస్థలాన్ని సహకార సంఘం సీఈవో పెంటయ్య పరిశీలించారు.

కరెంట్‌ షాక్‌తో యువకుడి మృతి

ఖలీల్‌వాడి: కరెంట్‌ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో నగరంలోని ధర్మపురిహిల్స్‌కి చెందిన మహ్మద్‌ అయాన్‌ ఖాన్‌ (23) ఇంటి వద్ద కూలర్‌ రిపేర్‌ చేసే క్రమంలో షాక్‌ తగిలింది. అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండాపూర్‌లో ఆవు..

రాజంపేట: విద్యుత్‌ షాక్‌ తగిలి జెర్సీ ఆవు మృతి చెందిన ఘటన రాజంపేట మండలం కొండాపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంగళి అభిలాష్‌ వ్యవసాయ పనులు చేసుకుంటూ రెండు జెర్సీ ఆవులను పోషిస్తున్నాడు. సోమవారం మేతకోసం వెళ్లిన ఆవులు ఎస్‌ఎస్‌టీ 20 ట్రాన్స్‌ఫార్మర్‌ వైపు వెళ్లి విద్యుత్‌ షాక్‌ తగిలి మృతి చెందాయి. సుమారు రూ.లక్షా 10 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

శిలాఫలకం ధ్వంసం



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్‌లో బీఆర్‌ఎస్‌ హయాంలో వేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రూ.60 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు గతేడాది సెప్టెంబర్‌ 22న వేసిన శిలాఫలకం ధ్వంసమైంది. ఆదివారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు కొంత మంది యువకులు ఇక్కడ బర్త్‌ డే వేడుకలు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మద్యం మత్తులో శిలాఫలకాన్ని ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్‌ నాయకుల ఫిర్యాదు మేరకు ఎస్సై అనిల్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోంలోన్‌ పేరుతో సైబర్‌ మోసం

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): తక్కువ వడ్డీకే హోంలోన్‌ ఇప్పిస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటన ఇచ్చిన సైబర్‌నేరగాళ్లు మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన వ్యక్తిని నమ్మించి మోసం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో ఇంటినిర్మాణం చేపడుతున్న చొన్నోళ్ల మధుసూదన్‌ అనే వ్యక్తికి ఫేస్‌బుక్‌లో ఓ యాడ్‌ కనిపించింది. తక్కువ వడ్డీకి రుణం ఇప్పిస్తామని, కింది నంబర్‌ను సంప్రదించాలని దానిలో ఉంది. మధుసూదన్‌ ఆ నంబర్‌కు కాల్‌చేయగా, అవతలి వ్యక్తి ఆయనను నమ్మించాడు. రుణం పొందాలంటే ముందుకు రూ.3,500 రిజిస్ట్రేషన్‌ ఫీజు చెల్లించాలని సూచించగా మధుసూదన్‌ ఫోన్‌పే చేశాడు. ఆ తరువాత సైబర్‌ నేరగాడు రూ.10వేలు అడగగా మళ్లీ పంపించాడు. అవతలి వ్యక్తి రూ.5లక్షల 40వేల హోం లోన్‌ వస్తుందని నమ్మిస్తుండడంతో 15 రోజుల వ్యవధిలో మధుసూదన్‌ మొత్తం రూ.70,250 చెల్లించాడు. ఆ తరువాత లోన్‌ విషయమై ప్రశ్నించగా, మరో రూ.12,500 చెల్లించి హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో ప్రాసెస్‌ పూర్తి చేసుకోవాలని సూచించడంతో అనుమానంతో స్నేహితులు, పోలీసులకు సమాచారం అందించాడు. చివరకు తాను మోసపోయినట్లు గ్రహించి లబోదిబోమన్నాడు. బాధితుడు సోమవారం సదాశివనగర్‌ పోలీసుకుల ఫిర్యాదు చేశాడు. సైబర్‌ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని సీఐ సంతోష్‌కుమార్‌, ఎస్సై రంజిత్‌ ప్రజలకు సూచించారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్‌

కమ్మర్‌పల్లి: మండలం హాసాకొత్తూర్‌లో 9 రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసులో నిర్మల్‌ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్‌ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్సై జి అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మిట్టపల్లి లక్ష్మణ్‌ తాను దొంగిలించిన బంగారం, డబ్బుతో జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో కారు కొనుగోలు చేసేందుకు వెళ్తూ సోమవారం కమ్మర్‌పల్లి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా పోలీసులకు కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఈ నెల 9వ తేదీన హాసాకొత్తూర్‌లోని నాయిని పురుషోత్తం ఇంట్లో చోరీకి పాల్పడడంతోపాటు ముప్కాల్‌ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.1.80 లక్షల నగదు, రెండు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. చోరీ కేసును ఛేదించడంలో సహకరించిన సీసీఎస్‌ పోలీసులు, స్థానిక సిబ్బందిని భీమ్‌గల్‌ సీఐ నవీన్‌కుమార్‌ అభినందించారు.